క్లుప్తంగా

వైఎస్ షర్మిలను కలిసిన జల్లేపల్లి వెంకటేశ్వర్లు



వైఎస్ షర్మిలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు జేవీఆర్

హుజూర్‌నగర్ : విదేశీ పర్యటన పూర్తి చేసుకుని స్వదేశానికి విచ్చేసిన వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) మంగళవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత్రికి నియోజకవర్గంలోని పరిస్థితులు, సమస్యలను తెలియజేసినట్లు చెప్పారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

నేడు మేలు జాతి దూడల, ఆవుల ప్రదర్శన

చిలుకూరు : చిలుకూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం మేలు జాతి దూడలు, ఆవుల ప్రదర్శన ఉన్నట్లు పశువైద్యాధికారి వీరారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ప్రదర్శనలకు ఎమ్మెల్యేతో పాటు జేడీ వస్తున్నట్లు చెప్పారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

మార్కండేయస్వామి జయంతి



మార్కండేయస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో మార్కండేయస్వామి జయంతిని మంగళవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు గుర్రం మార్కెండేయ, నర్సింహ, రమాదేవి, లక్ష్మణ్, యుగేందర్, శ్రీనివాస్, సోమశేఖర్, ఉపేందర్, శ్రీనివాస్, నాగరాజు తదితరులున్నారు.

దాతల దాతృత్వం అభినందనీయం



పాఠశాలకు ఎల్ఈడీ టీవీ బహూకరించిన దాత

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాలకు దాతల దాతృత్వం అభినందనీయమని సర్పంచ్ పత్తిపాటి రమ్యానాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీనివాసపురం ప్రాథమిక పాఠశాలకు హుజూర్‌నగర్‌కు చెందిన రామిశెట్టి రామ్మూర్తి జ్ఞాపకార్థం అతని కుమారుడు ఎన్ఆర్ఐ రామిశెట్టి శ్రీనివాస్ తన తల్లి శశికళ ద్వారా రూ.20 వేల విలువ గల ఎల్ఈడీ టీవీ అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చావా వీరభద్రరావు రూ.6 వేల విలువ గల నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. అనంతరం దాతలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం చిక్కుళ్ల గోవింద్, విద్యావేత్త డాక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ తుళ్లూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రామూర్తి, రవికిషోర్, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీదే అధికారం

మునగాల : రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రానుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాతులూరి హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 13న తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, నాయకులు నకిరెకంటి జగన్‌మోహన్ రావు, చల్లా వెంకటకృష్ణ పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలి

హుజూర్‌నగర్ : పార్‌బాయిల్డ్ రైస్‌మిల్ హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలని ఐఎఫ్‌టీయూ యూనియన్ గౌరవాధ్యక్షుడు మేకల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లుల యాజమాన్యాలతో హమాలీల రేట్ల పెంపుపై చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని కూలిరేట్లు పెంచాలని అన్నారు. అందుకు యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. సమావేశంలో అసోసియేషన్ నాయకులు పి.లక్ష్మీనరసింహారావు, గజ్జి ప్రభాకర్, అప్పారావు, కె.కోటేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, వి.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, కె.కిరణ్, కార్మిక వర్గ నాయకులు కాకి అజయ్, పి.గురవయ్య, పెదనాగేశ్వరరావు, పటేల్, ముఖేష్, చిన్న నాగేశ్వరరావు, రాజు, వీరయ్య, ప్రభు పాల్గొన్నారు.

ఆడపిల్లలు లేని ఇల్లు అంధకారం



మఠంపల్లి : కస్తూరిబా పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి



మేళ్లచెరువు : కస్తూరిబా విద్యాలయంలో..

మఠంపల్లి : ఆడపిల్లలు లేని ఇల్లు అంధకారమని, ఆడపిల్లలను భారంగా కాకుండా బాధ్యతగా పెంచాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బక్కమంతులగూడెం పరిధిలో గల కస్తూరిబా బాలికల పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల భోజన మెనూను పరిశీలించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానకిరాములు, ప్రిన్సిపాల్ విజయకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకళ, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌ల పంపిణీ

కోదాడరూరల్ : అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సూర్య టాలెంట్ స్కూల్‌లో అంజనీపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు టిఫిన్ బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు కంచుకొమ్ముల శంకర్, కార్యదర్శి నరేష్ నాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్ పిచ్చయ్య ఉన్నారు.



కోదాడ రూరల్ : విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న అంజనీపుత్ర ఫౌండేషన్ సభ్యులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కోదాడరూరల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు విద్యారంగ సమస్యల పరిష్కరించాలని నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలు చేయాలని, హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, హాస్టల్స్‌కు పక్కా భవనాలు నిర్మించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

మునగాల : మండలంలోని మాధవరంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం మునగాల వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో టై, బెల్టులను క్లబ్ జిల్లా గవర్నర్ గురుమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడారు. మునగాలలో వాసవీక్లబ్ చేపట్టే కార్యక్రమాలు బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎండీ.సలీం షరీఫ్, వాసవీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాపర్తి మణికంఠ కుమార్, చక్కా కిశోర్, జిల్లా కోఆర్డినేటర్ పీవీడీ.ప్రసాద్, వాసా శ్రీనివాసరావు, చిల్లంచర్ల శ్రీనివాసరావు, వజ్రపు మణిదీప, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

మోతె : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఎంపీపీ ముప్పాని ఆశ కోరారు. మంగళవారం మోతె మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కాగా పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించకపోవడంతో విద్యుత్ అధికారులను ప్రజాప్రతినిధులు సభలో ఎండగట్టారు. మండలంలో మామిళ్లగూడెం, బుర్కచర్ల గ్రామాల్లో మిర్చి కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని ఏపీఎం వెంకయ్య తెలిపారు. ఉపాధి హామీ పథకం కూలీలు జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఏపీఓ అన్నారు. మోతె, కూ డలి, బీక్యతండా గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ పనులు జరుగుతున్నాయని ఆ శాఖ అధికారులు తె లిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మందిళ్లపల్లి పుల్లారావు, తహసీల్దార్ పి.యాదగిరి, సూపరింటెండెంట్ వెంకటాచారి, ఎంపీఓ హరిసింగ్‌నాయక్, ఎంపీటీసీ లు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేత

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండా గ్రామంలో మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులు, దాతల సహకారంతో పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, బుట్టలు, ప్లేట్లు, పాఠశాలకు ఫ్యాన్, వాచ్, టెబుల్ ను ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఛత్రు నాయక్, సర్పంచ్ బాబునాయక్, గ్రామస్తులు తదితరులున్నారు.

సమస్యలను విడతలవారీగా పరిష్కరించుకుందాం

కోదాడరూరల్ : గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను విడతల వారీగా పరిష్కరించుకుందామని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుడిబండలో గల ఎస్సీ కాలనీలో ఆమె పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి సమస్యలను కాలనీ ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎండీ.సలీం, వార్డు సభ్యులు నాగయ్య, కలకొండ మల్లీశ్వరి, నాగయ్య, కుక్కడపు బుచ్చయ్య, పెరుమళ్ల ప్రభాకర్, సిద్దయ్య, పుల్లారావు ఉన్నారు.

ఉర్సుకు ఆహ్వానం..

గుడిబండలో ఈ నెల28, 29 తేదీల్లో జరగనున్న ఖాజానగర్ దర్గా ఉర్సును ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎంపీపీ కవితారాధారెడ్డి కోరారు. స్థానిక ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెను ఆహ్వానించిన సందర్భంగా మాట్లాడారు. ఉత్సవాలకు తనవంతు సహకరిస్తానని అన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ అసిఫ్‌అలీ, ఎండీ.సలీం, సభ్యులు ఉన్నారు.

ట్రాక్టర్ ర్యాలీని జయప్రద్రం చేయాలి

చిలుకూరు : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని బేతవోలు గ్రామంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నాగాటి రాములు, నాయకులు ఎగ్గడి లింగయ్య, బత్తిని వెంకటయ్య, నారసాని వెంకటేశ్వర్లు, పిల్లి వీర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 26న సూర్యాపేటలో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో వారు మాట్లాడారు. రైతులకు ఒకేసారి రుణమాఫీ అమలు చేయాలని, నాయకులు ఆర్.మురళి, నరసయ్య, పి.సత్యనారాయణ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేతనం పెంపుపై చర్చలు విఫలం

హుజూర్‌నగర్ : రైస్ మిల్లు కార్మికుల వేతనాల పెంపుపై రైస్ మిల్లర్స్ అసోసియేషన్, కార్మిక సంఘాల నాయకుల మధ్య సోమవారం అర్ధరాత్రి వరకు చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా కార్మికుడికి వేతనం నెలకి రూ.4 వేలు పెంచాలని కార్మికులు కోరగా యాజమాన్యం రూ.15 వందలు పెంచడానికి ముందుకు వచ్చారు. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి. మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలిశెట్టి లక్ష్మీనరసింహరావు, నాయకులు గజ్జి ప్రభాకర్, కుక్కడపు రామ్మోహన్‌రావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు రోషపతి, ఉపేందర్, గురవయ్య, పాండు, కోటేశ్వరరావు, వెంకన్న, సైదులు, మల్లయ్య, తిరపతయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు

కోదాడ : పట్టణంలో అనుమతి లేకుండా కట్టిన, కడుతున్న నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ కమిటీ హెచ్చరించింది. మంగళవారం కోదాడ ఆర్డీఓ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇప్పటికే కొన్ని అనుమతి లేని నిర్మాణాలను గుర్తించామని, మరోసారి పట్టణంలో తనిఖీలు నిర్వహించి అనుమతులు లేకుండా కడుతున్న భవనాల యజమానులకు నోటీసులు జారీ చేసి వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తదితరులు

ఇచ్చిన హామీలు మరిచిన కేంద్ర ప్రభుత్వం

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం సంయుక్త కిసాన్ మోర్చాకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాయలంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ 2021 డిసెంబర్ 9న ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మోసపూరిత ఆలోచనలతో రద్దు చేసిన మూడు నల్ల చట్టాలను తిరిగి మరో రూపంలో అమలు చేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కేంద్ర వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రాలలో జనవరి 26న ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించాలని సంయుక్త కిసాన్‌మోర్చా నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ముఖ్య నాయకులు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, ఎ.పున్నయ్య, జె.శ్రీనివాస్, జి.వెంకన్న, జె.వెంకటేశ్వర్లు, రమణ, ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధనుంజయనాయుడు, నాయకులు

నేరేడుచర్ల : కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు గత రెండేళ్లుగా ఫీజుల బకాయిలు రూ. 3వేల కోట్ల వరకు పెరుకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు చిలకరాజు శ్రీను, రేఖ ఉపేందర్, పరమేష్, విజయ్, శివ, విక్రం, మనోజ్, వెంకన్న, షరీఫ్ తదితరులున్నారు.

పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి

మేళ్లచెరువు : జీవాలకు వచ్చే వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని వేపలమాధవరం గ్రామంలో మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాగా గ్రామంలోని జీవాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. కార్యక్రమంలో మైహోం పరిశ్రమ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సర్పంచ్ సనిత బాలరాజు యాదవ్, ఎంపీటీసీ కొండల్‌రావు, ఏజీఎం నాగేశ్వరరావు, డాక్టర్ ఉషారాణి, శ్రీనివాసరెడ్డి, శేషగిరి, శేఖర్, ఖాజా, భగవాన్, శ్రీనాథ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీత్లాతండాలో పశువైద్య శిబిరం

గరిడేపల్లి : మండలంలోని సీత్లాతండాలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ గుగులోతు సోనీసైదానాయక్, వైస్ ఎంపీపీ గుంటికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యులు 30 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసి, పెంపకందారులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కల్మలచెరువు పశువైద్యాధికారి టి.సురేష్, సీహెచ్.నాగేందర్, కె.శంకర్ తదితరులున్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో మంగళవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ సుంకరి వాణి ప్రారంభించి మాట్లాడారు. 24 ఆవులు, 47 గేదెలకు గర్భకోశ చికిత్స చేయడంతో పాటు 21 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సుధాకర్‌నాయక్, ఉప సర్పంచ్ వెంకటి, సిబ్బంది నర్సింహచారి, సబేరా, భాస్కర్, స్వప్న, రామయ్య, రైతులు మురళి, నర్సింహారావు, సైదులు, శ్రీను, గురువయ్య, రామయ్య తదితరులున్నారు.

దృష్టి లోపం నివారణకే 'కంటి వెలుగు'

- ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : దృష్టి లోపం నివారణకే ప్రభుత్వం కంటి వెలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. రిజిస్ట్రేషన్, పేషంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు పథకాన్ని నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆచరణలో పెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కౌన్సిలర్ కేఎల్ఎన్‌రావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, గోపిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, రామకృష్ణ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎమ్మెల్యే సైదిరెడ్డి మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆస్పత్రిలో అపరిశుభ్రంగా ఉన్న గదులు దుర్వాసన వెదజల్లుతుండడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేసి ఇక్కడ వైద్యుడిని మార్చాలని సూచించారు. అంతకు ముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్పంచ్ శంకర్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్‌సింగ్ తదితరులున్నారు.



హుజూర్‌నగర్ : కంటి వెలుగు శిబిరంలో డాక్టర్లు, వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే సైదిరెడ్డి

కంటి వెలుగుకు భారీ స్పందన

మఠంపల్లి : కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని ఎస్‌సీఎల్, కృష్ణాతండాలలోని కంటివెలుగు కేంద్రాలను ఎంపీడీఓ జానకిరాములుతో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేందర్, సర్పంచ్‌లు దాసరి విజయలక్ష్మీవెంకటరమణ, రామారావునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్ల జోళ్ల పంపిణీ

చిలుకూరు : మండల కేంద్రంతో పాటు బేతవోలు గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. కంటి పరీక్షలు నిర్వహించి దగ్గర చూపు లోపం ఉన్న వారికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండు యాదవ్, సీహెచ్ఓ వినోద్, కళ్ల డాక్టర్ రాజేందర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సరికాదు

అనంతగిరి: ప్రశ్నిస్తే అరెస్టు చేసి కేసులు పెట్టడం సరికాదని బీఎస్పీ నాయకులు మంగళవారం అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఇటీవల అనంతగిరి మండలంలోని కోదాడ మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ తొలగించాలంటూ వెంకట్రాంపురం గ్రామస్తులు చెత్త వేయకుండా మున్సిపాలిటి వాహనాలను అడ్డుకున్న విషయం విధితమే. డంపింగ్ యార్డ్‌ను తొలగించాలంటూ వెంకట్రాంపురం గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సంయుక్తంగా డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడిన ఓ వీడియోను సోషల్ మీడియాలో బీఎస్పీ నాయకులు పోస్ట్ చేశారు. వెంకట్రామాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రేవెళ్ల కృష్ణ సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు, సంభాషణలు ఎమ్మెల్యేను కించపరిచేలా ఉన్నాయంటూ అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మంగళవారం ఉదయం బీఎస్పీ నాయకులు షర్మిల, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ పిల్లుట్ల శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. పిల్లుట్ల శ్రీనివాస్ అరెస్ట్‌కు నిరసనగా అనంతగిరి పోలీస్ స్టేషన్ బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పిల్లుట్ల శ్రీనివాస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పిల్లుట్ల శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించారు. ధర్నాలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్, ఉపాధ్యక్షుడు చింతల రమేష్, ప్రధాన కార్యదర్శి కంభపాటి శ్రావణ్‌కుమార్, సాలె రామావు, పాలకోట్ల శ్రీనివాస్, వెంపటి నాగమణి, మండల అధ్యక్షులు చిన్నం ఇర్మియా, పంది జాను, వినోద్, వినయ్, మన్మథుడు, ముదిగొండ నాగయ్య, కలకొండ భరత్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

ప్రజా పంపిణీ వ్యవస్థను బలహీనపరుస్తున్న మోదీ

గరిడేపల్లి : ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రధాని నరేంద్రమోదీ బలహీనపరుస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ములకలపల్లి రాములు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవనంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దారిద్య్ర రేఖకు దిగువనున్న ప్రజలకు ఆహార ధాన్యాలు అందించే ప్రజా పంపిణీ వ్యవస్థను రద్దు చేసేందుకు కేం ద్రం కుట్ర పన్నుతుందన్నారు. ప్రజా వ్యవస్థకు కేంద్రం అధిక బడ్జెట్ కేటాయించి 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలన్నారు. 2021 నాటికి జనగణన జరగని కారణంగా లక్షలాది మంది రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందించాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ సభ్యుడు కొదమగుండ్ల నగేష్, సీఐటీయూ జిల్లా నాయకుడు యాకుబ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ మహబుబ్‌అలీ, దోసపాటి భిక్షం తదితరులున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి

కోదాడ : కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారికి మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు, సాతులూరి హనుమంతరావు, చల్లా వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం నిర్వహించనున్న జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ టి.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'కంటి వెలుగు'

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి రెండవ విడత కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. మంగళవారం నడిగూడెంలో శిబిరం ఏర్పాట్లను కంటి వెలుగు పరిశీలకుడు డాక్టర్.కళ్యాణ చక్రవర్తి, త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న పరిశీలించారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామంలో గల ఎంపీయూపీఎస్ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో భాషా పండిత సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాషా పండిత ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికొండ రామ్మూర్తి మాట్లాడారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా భాషా పండితులకు కూడా పదోన్నతులు ఇ వ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.


ఆలయంలో అన్నదానం

చిలుకూరు : చిలుకూరు కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి చింతాపట్టణం రజనీకాంత్ ఆచార్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు దొడ్డా శ్రీను, అన్నదాన కమిటీ, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

హుజూర్‌నగర్ : గురుకులాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ పీఆర్సీ అమలుచేయాలని టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ అజీజ్ పాషా కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ గురుకులాలలో అవుట్ సోర్సింగ్, కాంటాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ అందరికీ పీఆర్సీ అమలు చేయాలని అన్నారు. వీరికి గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన పీఆర్సీ వర్తింపజేయలేదని, ప్రస్తుతం ఇస్తున్న జీతాలు మార్కెట్ ధరలకనుగుణంగా లేక వారికి కుటుంబ పోషణ భారమైందని చెప్పారు. ఈ విషయాలపై సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కుల మల్లయ్య, ముశం సత్యనారాయణ, ఎం.రజాక్‌బాబా, వెంకటేశ్వర్లు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బీమా కార్డుల పంపిణీ



కార్మికులకు బీమా కార్డులు పంపిణీ చేస్తున్న ఇటుక బట్టి యజమాని, నాయకులు

హుజూర్‌నగర్ : ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ బట్టీల యజమానులు బీమా సౌకర్యం కల్పించాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య కోరారు. హుజూర్‌నగర్ శివారులో గల ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు బీమా కార్డులను మంగళవారం ఇటుక బట్టి యజమాని బంటు సైదులుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైదులును ఆదర్శంగా తీసుకుని మిగతా బట్టీల యాజమాన్యం కూడా కార్మికులకు బీమా రక్షణ కల్పించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు పాశం రామరాజు, నాయకులు చింతకాయల రాము, నలికంటి జానయ్య, మేస్త్రి రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.